1,947కే విమాన టికెట్

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఆఫర్

న్యూఢిల్లీ, ఆగస్టు 2: ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్..77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఫ్రీడం సేల్ పేరుతో ప్రత్యేక ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఆఫర్ కింద ప్రారంభ విమాన టికెట్ ధరను రూ.1,947గా నిర్ణయించింది. ఈ నెల 5 లోపు బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు సెప్టెంబర్ 30లోగా ప్రయాణించాల్సి ఉంటుందని పేర్కొంది.

లాభాల్లో మెడ్‌ప్లస్

హైదరాబాద్, ఆగస్టు 2: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఔషధ విక్రయ సంస్థ మెడ్‌ప్లస్ హెల్త్ అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను సంస్థ రూ.14.36 కోట్ల లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన లాభంతో పోలిస్తే మూడు రెట్లు పెరిగినట్లు వెల్లడించింది. కంపెనీ ఆదాయం కూడా ఏడాది ప్రాతిపదికన 16 శాతం ఎగబాకి రూ.1,489 కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది.

ఇంటింటా ఇన్నోవేటర్ గడువు పొడిగింపు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): ఇంటింటా ఇన్నోవేటర్-2024కు దరఖాస్తు చేసుకునే గడువును పొడిగిస్తున్నట్లు తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ప్రకటించింది. ఆవిష్కర్తలు తమ దరఖాస్తులను సమర్పించడానికి ఈనెల 10 వరకు అవకాశం ఉందని పేర్కొంది. ఆవిష్కరణలను 9100678543 వాట్సప్ నంబర్‌కు పంపించాలని సూచించారు.

6న ఏఐపై వర్క్‌షాపు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 2(నమస్తే తెలంగాణ): కొత్తగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధస్సు పరిజ్ఞానంపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించేందుకు అమెజాన్ వెబ్ సర్వీసెస్‌తో కలిసి ఈ నెల 6న వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు టీ హబ్ ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా విస్తృతంగా వాడుకలోకి వచ్చిన ఏఐ టూల్స్ తరహాలో పరిశ్రమల అవసరాల కోసం ఉత్పాదక (జనరేటివ్)ఏఐపై ఆవిష్కర్తలు, స్టార్టప్ నిర్వాహకులు సమర్థవంతంగా పనిచేసేందుకు వీలుగా అమెజాన్ వెబ్ సర్వీసు (ఎడబ్ల్యుఎస్) సహకారంతో ఈ వర్క్‌షాపును నిర్వహిస్తున్నామని, ఔత్సాహికులు టీ హబ్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని టీ హబ్ ప్రతినిధి తెలిపారు.

4.5 లక్షల కోట్లు ఔట్

స్టాక్ మార్కెట్ నష్టాలతో ఒక్కరోజే భారీగా ఆవిరైన సంపద

రికార్డు గరిష్ఠాల నుంచి సూచీలు వెనుకకు • సెన్సెక్స్ 886, నిఫ్టీ 293 పాయింట్లు పతనం



ముంబై, ఆగస్టు 2: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస లాభాలకు బ్రేక్ పడింది. శుక్రవారం మదుపరులు లాభాల స్వీకరణ దిశగా అడుగులు వేశారు. దీంతో మెటల్, ఆటో, ఐటీ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. అమెరికా స్థూల ఆర్థిక గణాంకాలు బలహీనంగా నమోదు కావడం అంతర్జాతీయంగా ఈక్విటీ మార్కెట్లకు రుచించలేదు. ఈ ప్రభావం భారతీయ మార్కెట్లపైనా పడింది. ఆల్‌టైమ్ హైల్లో సూచీలు ఉండటంతోనూ ఇన్వెస్టర్లు పెట్టుబడుల ఉపసంహరణకు వెళ్లాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే భారీ నష్టాలు వాటిల్లాయి. ఫలితంగా 5 రోజుల లాభాలకు తెరపడినట్టైంది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 885.60 పాయింట్లు లేదా 1.08 శాతం క్షీణించి 80,981.95 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 998.64 పాయింట్లు పడిపోవడం గమనార్హం. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 293.20 పాయింట్లు లేదా 1.17 శాతం పతనమై 24,717.70 వద్ద స్థిరపడింది. ఇంట్రా-డేలోనైతే గరిష్ఠంగా 324.05 పాయింట్లు నష్టపోయింది.

రంగాలవారీగా..

రియల్టీ షేర్లు అత్యధికంగా 3.56 శాతం నష్టపోయాయి. మెటల్ 3 శాతం, ఆటో 2.97 శాతం, ఐటీ 2.05 శాతం, కమోడిటీస్ 1.83 శాతం, టెక్నాలజీ 1.79 శాతం, క్యాపిటల్ గూడ్స్ 1.70 శాతం చొప్పున క్షీణించాయి. ఇక మారుతీ సుజుకీ, టాటా మోటర్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎల్‌అండ్‌టీ, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్ షేర్లు మదుపరులను ఆకట్టుకోలేక నష్టాలను మూటగట్టుకున్నాయి. జూలైలో పడిపోయిన వాహన విక్రయాలతో ఆటో కంపెనీల షేర్లు, ఇన్ఫోసిస్‌కు వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) నోటీసుల కలకలంతో ఐటీ సంస్థల షేర్లు సెల్లింగ్ ప్రెషర్‌ను ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 0.58 శాతం, మిడ్‌క్యాప్ 1.19 శాతం చొప్పున పడిపోయాయి.

గ్లోబల్ మార్కెట్లలో..

అంతర్జాతీయ మార్కెట్ల తీరుతెన్నులను పరిశీలిస్తే.. ప్రధాన ఆసియా మార్కెట్లలో జపాన్, చైనా, హాంకాంగ్, దక్షిణ కొరియా సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. ఐరోపాలోని కీలక దేశాల స్టాక్ మార్కెట్ల పరిస్థితీ ఇలాగే ఉన్నది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెద్దన్నలా భావించే అమెరికాలో మరోమారు ఆర్థిక మాంద్యం ఛాయలు అలుముకుంటున్నాయా? అన్న అంచనాల నడుమ మదుపరులు పెద్ద ఎత్తున పెట్టుబడుల ఉపసంహరణకు దిగారు. ఈ పరిణామం భారత్‌సహా అన్ని దేశాల ఈక్విటీ మార్కెట్లను కుదిపేసినట్టు మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. జూలైలో ఐఎస్ఎం తయారీ సూచీ 46.6కు దిగజారింది. దీంతో మాంద్యం భయాలు మళ్లీ నెలకొన్నాయని అంటున్నారు. అలాగే ఇజ్రాయెల్-హమాస్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలూ నష్టాలకు దారితీశాయని వారు చెప్తున్నారు.

మార్కెట్ విలువ డౌన్

స్టాక్ మార్కెట్ల భారీ నష్టాల నడుమ ఒక్కరోజే మదుపరుల సంపద లక్షల కోట్ల రూపాయల్లో కరిగిపోయింది. బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.4,46,003.7 కోట్లు తగ్గి రూ.4,57,16,946.13 కోట్ల (5.46 ట్రిలియన్ డాలర్లు)కు పరిమితమైంది. బీఎస్ఈ లార్జ్‌క్యాప్ 1.08 శాతం, మిడ్‌క్యాప్ 1.19 శాతం, స్మాల్‌క్యాప్ 0.58 శాతం చొప్పున పడిపోయాయి. ఉదయం ఆరంభం నుంచే సూచీలు నష్టాల్లో కదలాడగా.. సమయం గడుస్తున్నకొద్దీ మరింత తీవ్రంగా నేలచూపులు చూశాయి.

మహీంద్రా గ్రూపు సంస్థల చైర్మన్ ఆనంద్ మహీంద్రా.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో మహీంద్రా గ్రూపు పెట్టుబడులపై ఇరువురు ప్రధానంగా చర్చించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో ఆటోమోటివ్ విభాగాన్ని ఏర్పాటు చేయడానికి ఆనంద్ మహీంద్రా అంగీకరించారు.

అమెరికాను భారత్ అందుకోలేదు

- **నాల్గోవంతు తలసరి ఆదాయాన్ని చేరాలన్నా 75 ఏండ్లు పట్టొచ్చు**
- **ప్రపంచ బ్యాంక్ తాజా నివేదిక**

న్యూఢిల్లీ, ఆగస్టు 2: అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకే చోదక శక్తి, ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన వృద్ధిరేటును సాధిస్తున్న దేశం అంటూ భారత్‌ను కీర్తిస్తున్న వేళ.. ప్రపంచ బ్యాంక్ విడుదల చేసిన ఓ నివేదిక అందులో నిజమెంత? అన్న అనుమానాల్ని రేకెత్తిస్తున్నది. రాబోయే కొన్ని దశాబ్దాల్లో భారత్‌సహా 100కుపైగా దేశాలు.. అధిక ఆదాయ దేశాలుగా ఎదిగేందుకు ఎన్నో తీవ్ర అడ్డంకులను ఎదుర్కోవాల్సి రావచ్చని వరల్డ్ బ్యాంక్ హెచ్చరించింది. ఈ క్రమంలోనే అమెరికా తలసరి ఆదాయంలో ఒక్క త్రైమాసికానికి సమానమైన ఆదాయాన్ని చేరాలన్నా.. భారత్‌కు దాదాపు 75 ఏండ్లు పట్టవచ్చని అంచనా వేసింది. ఇదిప్పుడు మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. ప్రపంచ అభివృద్ధి నివేదిక 2024: ది మిడిల్ ఇన్‌కమ్ ట్రాప్ పేరిట తెచ్చిన రిపోర్టులో అమెరికా తలసరి ఆదాయంలో నాల్గోవంతును చేరడానికి చైనా కైతే 10 ఏండ్లు పడుతుందని ప్రపంచ బ్యాంక్ అభిప్రాయపడింది. ఇండోనేషియాకు 70 ఏండ్లు పట్టవచ్చన్నది.

కటిక దారిద్ర్యం

గత ఏడాది చివరికల్లా భారత్‌సహా 108 దేశాలను మిడిల్ ఇన్‌కమ్ దేశాలుగా వర్గీకరించారు. ఒక్కోదాని వార్షిక జీడీపీ తలసరి ఆదాయం 1,136 డాలర్ల నుంచి 13,845 డాలర్ల మధ్య ఉన్నది. ఈ దేశాల్లో 600 కోట్ల జనాభా ఉండగా.. ఇది ప్రపంచ జనాభాలో 75 శాతానికి సమానం. అలాగే ఈ దేశాల్లో ప్రతీ ముగ్గురిలో ఇద్దరు కటిక దారిద్ర్యంలో మగ్గిపోతుండటం గమనార్హం. ఇదిలావుంటే 1990 నుంచి ఇప్పటిదాకా కేవలం 34 దేశాలే మధ్య ఆదాయ ఆర్థిక వ్యవస్థల నుంచి అధిక ఆదాయ ఆర్థిక వ్యవస్థలకు ఎదిగాయని ప్రపంచ బ్యాంక్ గ్రూప్ ప్రధాన ఆర్థికవేత్త గిల్ తెలిపారు.

రికార్డుస్థాయికి ఐటీ రిటర్నులు

7.28 కోట్ల మంది దాఖలు చేసినట్లు ఆదాయ పన్ను శాఖ వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 2: దేశంలో ఆదాయపు పన్ను చెల్లింపుదారులు భారీగా పెరిగారు. 2024-25 అసెస్‌మెంట్ ఏడాదికిగాను 7.28 కోట్ల మంది రిటర్నులు దాఖలు చేసినట్లు ఆదాయ పన్ను శాఖ తాజాగా వెల్లడించింది. 2023-24 ఏడాది దాఖలు చేసిన 6.77 కోట్ల కంటే వీరి సంఖ్య 7.5 శాతం అధికం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ఐటీ రిటర్నుల గడువు జూలై 31 చివరి రోజు 70 లక్షల మంది దాఖలు చేసినట్లు తెలిపింది. ఐటీ రిటర్నులు దాఖలు చేసిన 7.28 కోట్ల మందిలో నూతన పన్ను విధానాన్ని ఎంచుకున్నవారు 5.27 కోట్ల మంది కాగా, పాత పన్నుల విధానాన్ని కొనసాగించిన వారు 2.01 కోట్ల మంది. పన్ను చెల్లింపుదారుల ప్రాధాన్యతలు అంతకంతకు పెరుగుతున్నాయి. ఈసారి దాఖలు చేసిన వారిలో 72 శాతం మంది ఈ పన్ను విధానాన్ని ఎంచుకోగా, 28 శాతం మంది పాత పన్నుల విధానంలోనే దాఖలు చేశారు. అలాగే కొత్తగా దాఖలు చేసిన వారు 58.57 లక్షల మంది ఉన్నట్లు పేర్కొంది. దాఖలు చేసిన వారిలో ఐటీఆర్-1 కింద 45.77 శాతం(3.34 కోట్లు), ఐటీఆర్-2 కింద 14.93 శాతం(1.09 కోట్లు), ఐటీఆర్-3 కింద 12.5 శాతం(91.10 లక్షలు), ఐటీఆర్-4 కింద 25.77 శాతం(1.88 కోట్లు), ఐటీఆర్-5 నుంచి ఐటీఆర్-7 కింద 1.03 శాతం(7.48లక్షలు) కేటగిరిల కింద దాఖలు చేశారు. వీరిలో 43.82 శాతం మంది ఆన్‌లైన్‌లో ఐటీఆర్ దాఖలు చేయగా, మిగతావారు ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు.

పన్ను ఎగవేతలు కూడా..

పన్ను చెల్లింపుదారులు పెరిగినట్లే పన్ను ఎగవేతదారులు కూడా రికార్డు స్థాయిలో పెరుగుతున్నారు. గడిచిన పదేండ్లకాలంలో పన్ను ఎగవేతదారులు వెయ్యి రెట్లు పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో వెల్లడించింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.9.08 లక్షల కోట్ల పన్ను చెల్లింపులకు సంబంధించి నోటీసులు జారీ అయ్యాయి. 2013014 ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.80 వేల కోట్లుగా ఉన్నది.

టార్గెట్ 'ఇన్ఫోసిస్' మూర్తి!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ కంపెనీ రూ. 32,403 కోట్ల జీఎస్టీ ఎగవేతకు సంబంధించి కర్ణాటక స్టేట్ జీఎస్టీ అధికారులు ముందస్తు షోకాజ్ నోటీసులు పంపడంపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. ఐటీ ఉద్యోగులు వారంలో 70 గంటలు పనిచేయాలన్న నారాయణ మూర్తి కామెంట్లను ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు. ఇన్ఫోసిస్ జరిమానా కట్టడానికి ఎక్కువ గంటలు పనిచేయాల్సిందేనని పోస్టులు పెడుతున్నారు. కాగా ఎగవేతకు సంబంధించిన నోటీసులను వెనక్కి తీసుకొంటున్నట్టు జీఎస్టీ అధికారులు తాజాగా వెల్లడించడం గమనార్హం.

జియోథర్మల్ క్షేత్రంగా మణుగూరు!

అన్వేషణ, అభివృద్ధిపై త్రైపాక్షిక ఒప్పందం

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): భూతాపం ఆధారంగా విద్యుదుత్పత్తికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరును జియోథర్మల్ క్షేత్రంగా అభివృద్ధి చేయనున్నారు. అక్కడ 122 మోగావాట్ల జియోథర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి మూడు సంస్థలు సిద్ధమవుతున్నాయి. మణుగూరు సమీపంలోని పగిడేరు వద్ద ఏర్పాటు చేయడానికి శుక్రవారం సింగరేణి, ఓఎన్‌జీసీ, తెలంగాణ రెడ్కోల మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. దీనికి సింగరేణి సీఎండీ ఎన్ బలరాం, ఓఎన్‌జీసీ డైరెక్టర్ సుష్మారావత్, రెడ్కో జీఎం సత్యవరప్రసాద్‌లు హాజరయ్యారు. ఇప్పటికే 20 కిలోవాట్ల విద్యుదుత్పత్తికి సంబంధించిన పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతమవ్వగా, 122 మెగావాట్లకు వీలుందని ఓఎన్‌జీసీ నివేదిక వెల్లడించింది. మరికొన్ని పరిశోధనల్లో 3,500 మోగావాట్ల వరకు జియోథర్మల్ విద్యుదుత్పత్తికి అవకాశమున్నట్లుగా తేలింది.

రోజుకు 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి..

రోజుకు 2లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాన్ని సాధించాలని సింగరేణి సీఎండీ బలరాం అధికారులను ఆదేశించారు. రోజుకు 13.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలని, రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రాధాన్యతనివ్వాలని ఆయన సూచించారు.

ఆసిఫాబాద్ రేంజ్ అధికారిగా

గోవింద్ సింగ్ సర్దార్

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 2 : ఆసిఫాబాద్ రేంజ్ అధికారిగా గోవింద్ సింగ్ సర్దార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆసిఫాబాద్ రేంజ్ అధికారిగా పనిచేసిన అప్పలకొండ నీల్వాయి రేంజ్ అధికారిగా బదిలీ కావడంతో, ఆయన స్థానంలో కుశ్నపల్లి రేంజ్ అధికారిగా పనిచేస్తున్న గోవింద్ సింగ్ సర్దార్ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు.

దరఖాస్తు చేసుకోవాలి

లింగాపూర్,ఆగస్టు 2 : మండలం లోని రైతులు రైతు బీమా కోసం ఈ నెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఏఈ వో శ్రీనివాస్ శుక్రవారం ఒక్క ప్రకటనలో తెలిపారు. కొత్తగా పట్టా పాసు పుస్తకం వచ్చిన వారు ఆధార్ కార్డ్ జిరాక్స్, నామిని ఆధార్‌కార్డ్ జిరాక్స్, పట్ట పాసు పుస్తకం జిరాక్స్‌లు రైతు బీమా దరఖాస్తు పారం నింపి వ్యవసాయ కార్యాలయంలో అందజేయాలని ఆయన పేర్కొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

కెరమెరి, అక్టోబర్ 2: అక్రమంగా గుడుంబా అమ్ముతున్న వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ విజయ్ తెలిపారు. ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జిల్లాలో గంజాయి, గుడుంబా పూర్తిగా నిర్మూలనలో భాగంగా శుక్రవారం మండలంలోని సోమ్లగూడ గ్రామానికి చెందిన ధారావత్ తిరుపతి గత కొద్ది రోజులుగా తన ఇంట్లో గుడుంబా తయారు చేసి సోమ్లగూడ గ్రామంలో అమ్ముతున్నాడనే సమాచారం మేరకు అతనిపై నిఘాపెట్టగా, సాయంత్రం 6.10 గం.ల ప్రాంతంలో 10లీటర్ల గుడుం బాను రెండు ప్లాస్టిక్ క్యాన్‌లో తీసు కొచ్చి అమ్ముతుండగా ఆయనను పట్టుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

అధికారులకు సన్మానం

వాంకిడి,ఆగస్టు 2 : బాధ్యతాయుతమై విధులతోనే ఉద్యోగులకు గుర్తింపు వస్తుందని అటవీ శాఖ (డీఆర్‌వో) సరోజా రాణి అన్నారు. మండలంలో అటవీ శాఖలో బదిలీపై వెళ్తున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లను, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లను డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సరోజా రాణి ఘనంగా సన్మానించారు. ఇక్కడ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సరోజ రాణితో పాటు (ఎఫ్‌బీవో) రామ్మూర్తి చెక్ పోస్ట్ వాచర్లు నగేశ్, టెమజీ, సంతోశ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం' విజయవంతం చేయాలి

కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 2 : ఈ నెల 5వ తేదీ నుంచి 9 వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని మండలాల ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొనాలని తెలిపారు. ప్రతిరోజు నిర్వహించే కార్యక్రమాలపై మండల స్థాయి, గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించాలని, పంచాయితీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, మల్టీ పర్పస్ వర్కర్లు, అన్ని శాఖల ఉద్యోగులు మహిళా సంఘాలలో సమావేశాలు నిర్వహించాలని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఈ కార్యక్రమంలో గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారులు లోకేశ్వర రావు, కాసబోయిన సురేశ్, జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావు పాల్గొన్నారు.

వనరులను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలోని వనరులను సద్వినియోగం చేసుకుంటూ వివిధ రకాల ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. జిల్లా స్థాయి ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్‌తో కలిసి హాజరయ్యారు. జిల్లాలో ఎగుమతి చేయగలిగిన ఉత్పత్తులను గుర్తించాలని అన్నారు. జిఐ ట్యాగ్ కలిగిన డోక్రా కాస్టింగ్ ఉత్పత్తులను ఎగుమతి చేయాలన్నారు. ఇక్కడ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆర్. శ్రీనివాసరావు, నాబార్డు డిడిఎంకె వీరభద్రుడు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన

తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ అన్నారు. తల్లిపాల వారోత్సవాలకు సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. జిల్లా సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ పుష్పలత, జిల్లా పోషణ్ అభియాన్ సమన్వయకర్త గోపాలకృష్ణ, జిల్లా మహిళా సాధికారత సమన్వయకర్తలు స్వప్న, శారద, సూపర్వైజర్ పెంటు బాయ్, సఖి కేంద్రం సభ్యులు, అంగన్వాడి టీచర్లు, గర్భిణులు బాలింతలు పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా ఇన్నోవేటర్-2024 కార్యక్రమం కొరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈనెల 10వ తేదీ వరకు పొడిగించామని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను వాట్సాప్ ద్వారా 9100678543 పంపించవచ్చని తెలిపారు.

కూరగాయల సాగుతో ఆదాయాన్ని పొందాలి

జిల్లాలోని ఆదిమ గిరిజన రైతులు కూరగాయల సాగు ద్వారా మరింత ఆదాయాన్ని పొందాలని, పోషక విలువలు కలిగిన ఆహారంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ-ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ దీపక్ తివారిలతో కలిసి గిరిజన రైతులకు 12రకాల కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. పీవీటీజీల ప్రత్యేక అధికారి మనోహర్, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ-ఉద్యానవన అధికారి సందీప్, గిరిజన అభివృద్ధి శాఖ అధికారులు ఉన్నారు.

వైద్యులను నియమించాలి

బెల్లంపల్లి, ఆగస్టు 2 : బెల్లంపల్లి సింగరేణి ఏరియా దవాఖానలో వైద్యులు, ఫార్మసిస్టులను నియామకం చేసి కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శుక్రవారం బెల్లంపల్లి ఏరియా నాయకులతో కలిసి సీఎండీ బలరాంకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజ్ శ్రీనివాసరావు, కార్యదర్శులు మారిన వెంకటేశ్, అలవేణి సంపత్, సెంట్రల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ ధరావత్ మంగీలాల్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి అనుముల సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శులు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ అండ్ పీసీ సెక్యూరిటీ గార్డుల బదిలీ

మందమర్రి, ఆగస్టు 2: సింగరేణి మందమర్రి ఏరియాలో ఎస్ అండ్ పీసీ విభాగంలో సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్న పలువురిని సాధారణ బదిలీలలో భాగంగా వివిధ ఏరియాలకు బదిలీ చేస్తూ శుక్రవారం కార్పొరేట్ జీఎం పర్సనల్ ఆదేశాలు జారీ చేశారు. మందమర్రి ఏరియాలో ఎస్ అండ్ పీసీ సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్న బండపెల్లి రమేశ్‌ను ఎస్‌బి హైదరాబాద్‌కు, జావాజి బాబును రామగుండం-2, జంగ కృష్ణస్వామిని మనుగూరుకు, అనుగుల రాజయ్యను భూపాలపెల్లి ఏరియాలకు బదిలీ చేస్తూ కార్పొరేట్ జీఎం పర్సనల్ ఆదేశాలు జారీ చేశారు. కాగా ఒక ఉద్యోగి గతంలోనే తనను హైదరాబాద్‌కు బదిలీ చేయాలని దరఖాస్తు చేసుకోగా సాధారణ బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

ఇళ్ల పట్టాలు ఇప్పించాలని వినతి

శ్రీరాంపూర్, ఆగష్టు 2 : శ్రీరాంపూర్, సీసీసీ ఏరియాలోని సింగరేణి స్థలాల్లో గత 30 ఏండ్లుగా నివాసం ఉంటున్న కార్మికు కుటుంబాలకు ఇల్ల స్థలాల పట్టాలు ఇప్పించాలని కోరుతు సీపీఐ ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావుకు శుక్రవారం హైదరాబాద్‌లో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, కౌన్సిలర్ మేకల దాసు వినతి పత్రం అందించారు. ఈ మేరకు ఎమ్మెల్యే సాంబశివారావు అసెంబ్లీలో మాట్లాడి ప్రభుత్వం దృష్టికి తీసుకెల్లారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో, సీపీఐ శ్రీరాంపూర్ కార్యదర్శి పూజారి రామన్న, సింగాపూర్ కార్యదర్శి కే మహేష్, కోశాదికారి కూన సాయికిరణ్‌లు పాల్గొన్నారు.

సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 2 : జిల్లాలో ఈనెల 13 నుంచి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో నిర్వహించనున్న సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 13న మూగ, చెవిటి, మానసిక వైకల్యం, 16న కంటిచూపు, 27న ఎముకల సంబంధిత సమస్యలు గల వారికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

సింగరేణి సీఎండీని కలిసిన ట్రైకార్ చైర్మన్

దండేపల్లి, ఆగష్టు 2 : రాష్ట్ర గిరిజన ఆర్థిక అభివృద్ధి కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి శుక్రవారం హైదరాబాద్‌లో సింగరేణి సంస్థ సీఎండీ బలరాంనాయక్‌ను కలిశారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల గుర్చి ఆయనతో చర్చించారు. అనంతరం ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ శరత్‌ను కలిశారు. ఇరువురు తమ సమస్యలపై సానుకూలంగా స్పందించారని అన్నారు.

బదిలీపై వెళ్తున్న సిబ్బందికి వీడ్కోలు

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్ట్ 2 : జిల్లాలోని ఆసిఫాబాద్ రేంజ్ పరిధిలో పనిచేసి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్తున్న రేంజ్ అధికారి అప్పలకొండతో పాటు అటవీ సెక్షన్ బీట్ అధికారులు సత్యనారాయణ, భగవంతరావు, లక్ష్మణ్, స్వప్న, రవి, మహేష్, రజిత, శ్రీనివాస్ లకు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్ , సరోజరాణి, సెక్షన్ అధికారి సాయి, సిబ్బంది పాల్గొన్నారు..

రోజుకు రూ.2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలి

శ్రీరాం